# తప్పెన్ను వారు...

పిప్పళ్ల సూర్యప్రకాశరావు




సుబ్బరామయ్య దంపతులు దిగిపోయారు

*  *  *

"చూసారా మాష్టారూ పాపం సుబ్బరామయ్య గారు బెజవాడ వచ్చేవరకూ సిగరెట్టు తాగలేదు. పాపం ఆవిడ చెప్పేవరకూ సిగరెట్టేం ఖర్మ మంచి నీళ్లు కూడా ముట్టడు."

"మనం అడక్కుండానే ఎవడైనా నేను పెళ్లాం మాటలు వినను అన్నాడనుకోండి అంటే ఇంట్లో పెళ్లాం అంటే వణుకుడన్నమాట!

ఎవరన్నారో నాకు తెలియదుగాని పెళ్లయిన ప్రతీ వెధవా పెళ్లాం మాటలు వింటాడు. ఎటొచ్చీ ఏ మోతాదులో వింటాడూ అనే దాంట్లోనే తేడా!"

"ఇపుడు దిగినాయన సంగతేనా మీరు చెపుతూంట ఎవరండాయన" నారాయణమూర్తి మాష్టారు అడిగారు

"ఆయనాండి రిటైర్డ్ సూపరెంటెండింగ్ ఇంజనీర్ సుబ్బరామయ్యగారు పెన్షన్ యీయన పుచ్చుకుంటున్నా అందరి దృష్టిలో పనిజేసింది మాత్రం వాళ్లావిడే. అటువంటాయన డాక్టరుగార్ని పెళ్లాం చేతికింద వెధవని అంటున్నాడు. గురువింద గింజకు తన కిందున్న నలుపు తెలియదట!

డాక్టరుగార్ని పీసనారి పీసనారని తెగ తిట్టి పోసాడు. కాని ఆయనే అసలైన పీసనారి.

కొడుకు లిద్దరి పెళ్లి కోడళ్ళ మొహాలు చూసి చేయలేదు. వాళ్ళు పట్టుకొచ్చే కట్నాలు చూసి చేసాడు అందుకే జర్మనీ వెళ్ళిన మొదటి కొడుకు పెళ్లాన్ని ఇండియాలో వదిలి అక్కడే వుండిపోయాడు. రెండోవాడి పెళ్లాం అవిటిది అందుకనే లక్షకుపైగా గుంజాడు సరే కూతురికి కట్నం యివ్వాల్సివస్తుందని మేనరికం అనే వంకతో గుమాస్తాకి కట్టబెట్టాడు. కొడుకులు పట్టుకొచ్చిన కట్నమంతా పెళ్లాం పేర వేసాడు

ఈయనగారింట్లో పెళ్లి ఖర్చు అంతా ఎవరిదండీ? కంట్రాక్టర్లది. ఆఖరికి కంట్రాక్టర్లు పంపిన అరిటాకులు, పెరుగు పెళ్లిలో మిగిలిపోతే పక్క వూరి హోటళ్లలో అమ్మించి డబ్బు చేసుకున్నాడు.

పెట్రోల్ బంక్ —

పర్సు తీసి రాంమూర్తి డబ్బిస్తూ కుర్రాడితో మిగతాది తర్వాత యిస్తానంటున్నాడు:

"నాకు తెల్దు బాబు. ఆయన నన్నట్టుకుని నానా బూతులు తిడతాడు. పెట్రోలు పోయించే ముందు మాసుకోవాలి బాబూ."

"ఏమైందండీ?" మాష్టారడిగారు

"ఏమీలేదు మాష్టారూ. పది రూపాయలదాకా తక్కువైంది."

పది రూపాయలు తక్కువైందా?

కంట్రాక్టర్ రాంమూర్తి దగ్గర పాపం పది రూపాయలు తక్కువయ్యాయి!

అందులోకి పాపం రాత్రంతా పెళ్లిలో తెల్ల వార్లూ పేకాడి వేయి రూపాయలదాకా గెల్చుకున్నాడు!

మొత్తానికి టికెట్ ఖర్చులు వసూలు చేసేస్తున్నాడన్నమాట!

డాక్టరుగారు తను వద్దు వద్దు అంటుండగానే "ఒరేయ్ రాంమూర్తి మాష్టారిని దార్లో దించేయరా అలాగే వెళ్లాలిగదరా నువ్వు" అన్నారు.

రండి మాష్టారూ రండని రాంమూర్తి కూర్చోబెట్టుకుంటే, బడిపంతుల్ని గౌరవించే నూటికో కోటికో వున్నవాళ్లలో రాంమూర్తి ఒకడని తను మురిసిపోయాడు.

"ఇదిగోండి. ఏమిటి ఆలోచిస్తున్నారు? పెళ్లికొడుకు, పెళ్లికూతురు దణ్ణాలు పెట్టగా, యివ్వగా మిగిలింది పదిహేనని" చెంగు ముడి విప్పి అందించింది భర్త నారాయణమూర్తి మేష్టారుకి, సుగుణమ్మ.

"నా దగ్గరుండదండి తీసుకోండి" అన్నారు మాష్టారు

వద్దంటూనే తీసుక్కొని, కుర్రాడికి డబ్బులిచ్చి, కారు స్టార్ట్ చేసాడు రాంమూర్తి

"అసలు సుబ్బరామయ్యగారి తమ్ముడు బెజవాడలోనే వున్నారు ఆయనకు ఆరుగురు పిల్లలు కనీసం ఆరు రూపాయిలైన పిల్లల కివ్వవల్సివస్తుందని ఆయన ఇంట్లో దిగరు ఇపుడాయన మరో స్నేహితుడి యింట్లో అంత పీసనారి ఆయన సిగ్గు లేకుండా డాక్టరుగార్ని. ."

రాంమూర్తి చెపుతూనేవున్నాడు, మధ్యలో మాష్టారు అందుకొని "తను ఎన్ని తప్పులు చేసినా తనని తప్ప మిగతావాళ్లందర్నీ విమర్శించుతాడు మనిషి! అదే అతనిలో గొప్పతనం మరి!

వీళ్లకున్న వేళ్లన్నీ యితరులవైపే చూపుతాయి. ప్రజలకు తాము మంచి కొంచెమైనా చేయక పోయినా, ప్రభుత్వం ఏమి చేసినా ఎప్పుడూ విమర్శించే ప్రతిపక్షం లాంటివాళ్ళు వీళ్ళు!

బురదలో బెడ్డ వేస్తే అది అందరిమీదా చిందుతుంది.

ఇతరులమీద పేడముద్దలు కొడితే మన చేయూ పాడవుతుంది

విమర్శ అనేది పెంపుడు జంతువు లాంటిది తిరిగి తిరిగి మనింటికే వస్తుందని ఎవరో చెప్పారు!

అయినా —

డాక్టర్ జాన్సన్ ఏమన్నాడో తెల్సాండీ? "దేవుడంతటివాడే మనిషి చచ్చేవరకూ వాడి మంచి చెడ్డల గురించి మాట్లాడడు మరి మనిషి బ్రతికుండగా వాడెంత చెడ్డవాడైనా విమర్శించడానికి నువ్వూ నేనూ ఎవరం?" అని

బాగా చెప్పాడు కదాండీ!" నారాయణమూర్తి గారు అడిగారు, రాంమూర్తిని.

రాంమూర్తి మరింక మాట్లాడలేదు ఏమనుకున్నాడో మరి!